# నిధి చాల సుఖమా

## కె.ఎస్. లత

కాలింగ్ బెల్ మోతకి చదువుతున్న పుస్తకం పక్కన పడేసి విసుక్కుంటూ లేచింది హారిక.

తలుపు తీసి ఎదురుగా ఉన్న సంధ్యని చూసి 'హాయ్' అంటూ కెవ్వున అరిచింది.

"వాట్ ప్లెజంట్ సర్‌ప్రైజ్! అసలు నువ్వు నువ్వేనా? ఏమిటిలా ఊడి పడ్డావు?"

"మంచి ఎండలో వచ్చేను గానీ .... కాస్త చల్లని మంచి నీళ్ళిస్తే నీ ప్రశ్న లన్నింటికీ సమాధానం చెప్తాను." సోఫాలో కూర్చుంటూ అంది సంధ్య.

"ఇప్పుడే వస్తా నుండు" అంటూ లోపలికి వెళ్ళింది హారిక.

సంధ్య హాలంతా పరికించి చూసింది.

ఖరీదైన ఫర్నీచరు. అందమైన షోకేస్. తాజా పువ్వులతో చక్కటి ఫ్లవర్‌వేజ్. ముచ్చటైన పెయింటింగ్స్. తన అంచనాని మించి ఉంది ఇల్లు.

"ఏమిటి విశేషాలు? ఇప్పుడు చెప్పు" అంటూ మంచి నీళ్ళ గ్లాసుతో వచ్చింది హారిక.

"మా కీ ఊరు ట్రాన్స్ఫర్ అయింది."

"హాయ్ నిజంగా" అంటూ పక్కనే కూర్చుని సంధ్యని కుదిపేసింది హారిక.

"ఈ ఊరొచ్చి వారం రోజులైంది - అయితే ఇప్పుడా రావడమని నిష్ఠూర మాడక. రాగానే ముందర ఫోన్ చేద్దామనుకున్నాను గానీ .... స్వయంగా వచ్చి నీ రియాక్షన్ చూద్దామని ...."

"పెద్ద గొప్పేలే - ఇల్లు తేలిగ్గా తెలిసిందా?"

"ఈ ఊర్లో మీ ఇల్లు తెలియక పోవడమా. డాక్టర్ శ్రీకాంత్ గారి ఇల్లంటే చెట్టు నడిగినా, పుట్ట నడిగినా కళ్ళు మూసుకు వచ్చే యొచ్చు."


సంధ్య మాటలకి హారిక మొహం గర్వంతో వెలిగి పోయింది.

"ప్రాక్టీసు చాలా గొప్పగా సాగుతోందటగా."

"ఏం గొప్పలే - ఆయన గారికి ఒక నిముషం తీరిక ఉండదు. రోజుకి ఇరవై నాలుగు గంటలు సరిపోవడం లేదనుకో - ఎప్పుడు చూడూ- హాస్పిటలు డిస్పెన్సరీ, పేషంట్లు. పెళ్ళాం, పిల్లలూ ఈ గొడవే పట్టదు. రాత్రి పదకొండయినా రోగులు, రోగాలే ...."

"రోరింగ్ ప్రాక్టీసన్న మాట."

"రోరింగ్ కాదు - బోరింగ్ అను. చస్తున్నా ననుకో. అన్నీ నేనే చూసుకోవాలి. ఎక్కడి కెళ్ళినా నే నొక్కర్తినే వెళ్ళాల్సిందే. చివరికి పిల్లల స్కూల్‌లో 'పేరంట్స్ డే కి రమ్మన్నా కుదర దంటారు. అన్నీ ఉండి అనుభవించ లేకపోవడ మంటారు చూసేవా అలా ఉంది నా పని. పగ లంతా హాస్పిటల్లో పని చేసి వస్తారు కదా, మళ్ళీ సాయంత్రం డిస్పెన్సరీ అంటూ తయారవక పోతేనేం. మరీ డబ్బే ముఖ్య మనుకుంటే ఎలా? రేపు నా కూతుర్ని మాత్రం ఛస్తే డాక్టరు కిచ్చి పెళ్ళి చెయ్యను." అక్కసుగా అంది హారిక.




నవ్వింది. సంధ్య. "నీ కేం తక్కువే! లంకంత కొంప - నౌకర్లు, చాకర్లు ...."

"ఆ ... అదే - బంగారు పంజరంలో చిలకలా ఉంది బ్రతుకు .... అదుగో కారు హారన్ - మాటల్లోనే వచ్చేరు" అంటూ లేచింది హారిక.

బూట్లు టకటక లాడించుకుంటూ వచ్చేడు శ్రీకాంత్.

"అరే - మీరా! ఎప్పు డొచ్చేరు" అంటూ సంధ్యని పలకరించి "ఇప్పుడే వస్తా నుండండి" అంటూ లోపలికి వెళ్ళాడు.

హారిక శ్రీకాంత్‌ని అనుసరించింది.

కాస్సేపట్లో బయటికి వచ్చిన శ్రీకాంత్ "ఆఁ. ఇప్పుడు చెప్పండి .... ఏమిటి విశేషాలు? ఈ ఊరికి ట్రాన్స్ఫ రయిందటగా. ఇక మీ స్నేహితురాలికి బోలెడంత కాలక్షేపం. తోచడం లేదని నా ప్రాణాలు తీస్తూ ఉంటుంది."

"ఎలా అంటూన్నారో విను. నేను ప్రాణాలు తీస్తున్నా ననే గానీ పెళ్ళాన్ని ఎక్కడి కైనా తీసికెళ్దాం - తనకీ సరదాలు ఉంటాయని అనిపిస్తుందా ఆ మనిషికి? హాస్పిటల్ నుండి వచ్చేక కూడా ఎంతసేపూ పేషంట్లంటూ నా పేషన్స్ పోగొడ్తారు" చిర చిర లాడింది హారిక.

"మీరు తర్వాత పోట్లాడుకుందురు గానీ నేను ముఖ్యంగా ఎప్పుడు ఎందుకు వచ్చే నంటే రేపు మా 'పాప' పుట్టిన రోజు .... మిమ్మల్నిద్దర్నీ ఇన్‌వైట్ చేద్దామని వచ్చేను."

"వెరీ గుడ్ తప్పకుండా వస్తాం" అన్నాడు తడుము కోకుండా శ్రీకాంత్.

"ఆఁ ఆ - తప్పకుండా వస్తారు. మొహం చూడు మొహం - ఆయన సంగ తెలా ఉన్నా నేను వస్తాను లేవే. పేషెంట్లని వదిలేసి మీ ఇంటికి వస్తే భూమి తలక్రిందులై పోదూ." వెక్కిరించింది హారిక.

"అదంతా నాకు తెలియదు గానీ నేను మాత్రం మీ కోసం ఎదురు చూస్తు ఉంటాను" అంటూ కాస్సేపు కూర్చుని శెలవు తీసుకుంది సంధ్య.

* * * * * *

ఆ రోజు పేపర్లో "గవర్నమెంటు డాక్టర్లు ప్రైవేట్ ప్రాక్టీసుపై నిషేధం" అన్న వార్త . చూడగానే సంధ్యకి వెంటనే హారిక గుర్తు కొచ్చింది.

"హమ్మయ్య! ఇదే దో హారిక కోసమే పెట్టినట్లుంది. ఆ మానవు డింక కాస్త తెరిపిగా ఉంటాడు. ఎంత సంతోషించిందో ఈ వార్త విని అది - సాయంత్రాలు కూడా రోగులు, రోగాలు అని కాకుండా సరదాగా పెళ్ళాం పిల్లలతో గడపొచ్చు. వీలు చూసుకుని హారికని కలవాలి. అప్పుడు పంజరంలో చిలక నంది. ఇప్పుడు స్వేచ్ఛా విహంగంలా ఎలా ఉంటుందో చూడాలి" అనుకుంది.

* * * * * *

"హాయ్! హారికా! ఎలా ఉన్నావు? రెండు నెలలుగా మీ ఇంటికి వద్దామని ... కానీ అనుకోకుండా ఊరి వెళ్ళాల్సి వచ్చింది, మా ఆడబడుచు పెళ్ళికి. ఊరి నుండి రాగానే నిన్నే చూడా లనిపించి వచ్చేశాను. ప్రైవేట్ ప్రాక్టీసు బాన్ చేసేరుగా! ఎలా ఉంది లైఫ్ ఇప్పుడు? నీ కిష్టం వచ్చినట్లు విచ్చల విడిగా ఫ్రీ బర్డ్‌గా విహరిస్తున్నావా? మీ శ్రీవా రేరి?" ఆసక్తిగా అడిగింది సంధ్య.

"ఏం వేళాకోళంగా ఉందా?" మూతి ముడుచుకుంది హారిక.

"అదేంటే అలా అంటావు? మీ వారిప్పుడు



డ్యూటీ నుండి రాగానే నీ కనుసన్నలలోనే మెలుగుతున్నారుగా. నువ్వు కోరుకున్న జీవితమేగా ఇది..."

"ఏం కోరుకోవడమో. ఛస్తున్నా ననుకో! శ్రాద్ధస్తమానం ఆడంగిలా ఇంటి పట్టునే నా కొంగు పట్టుకునే ఉంటారు. ఇలా హాస్పిటల్ కెళ్తారో లేదో అలా వచ్చేస్తారు. వాళ్ళిచ్చే ఆ జీతం రాళ్ళతో బ్రతక లేక ఛస్తున్నాం అనుకో! ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉంది. కటకట లాడిపోతున్నాం. పోనీ వలంటరీ రిటైర్‌మెంటు తీసుకుందా మంటే ధైర్యం చాలడం లేదు. రాత్రింబగళ్ళు రెండు చేతులా సంపాదించి ఇప్పుడు చేత కాని దద్దమ్మలా చేతులు ముడుచుకుని కూర్చున్నారు. ఏం చెప్ప మంటావు మా సంసారం సంగతి!" వాపోయింది హారిక.

సంధ్య నోట మాట రాలేదు.

ఆశ్చర్యాన్నుండి తేరుకో లేకపోయింది.

డబ్బే ముఖ్యమా? పెళ్ళాంపిల్లలు అక్కర్లేదా అన్న హారికేనా ఈ రోజు ఇలా మాట్లాడుతోంది? ధన మేనా అన్నిటికీ మూలం?" అని, అనుకోకుండా ఉండ లేకపోయింది.

* * * * * *

"హలో! హారికా ! నేనే సంధ్యని మాట్లాడ్తున్నాను."

"హాయ్ మేడమ్! ఏమిటి సంగతి చెప్పు? చాలా రోజులకి మనిషివి రాకుండా ఫోన్ చేసే వంటే ఏదో విశేషమే ఉండి ఉండాలి."

"విశేషమా అంటే విశేషమే. మాకు ఈ రోజే ఫోన్ కనెక్షన్ వచ్చింది. మొదటి ఫోన్ నీకే చేస్తున్నాను."

"వెరీ గుడ్! ఇంక బోలె డంత కాలక్షేపం అన్నమాట. అసలు నిన్నటి నుండి నిన్ను ఎలా కాంటాక్ట్ చేయాలా అని చూస్తున్నాను?"

"ఏమిటి సంగతి?" కుతూహలంగా అడిగింది సంధ్య.

"రేపు సాయంత్రం రవీంద్ర భారతిలో చిట్టిబాబు వీణ కచేరి ఉంది. రెండు టిక్కెట్లయితే తీసుకున్నాం గానీ, ఈయన గారు ఆయన మొదటి పెళ్ళాన్ని .... అదే డిస్పెన్సరీని వదలి రారట. ఒక్కర్తినీ ఎలా వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాను. ఈ లోగా నువ్వు ఫోన్ చేశావు. నువ్వు ఎలాగైనా వీలు చేసుకుని వచ్చి తీరాలి."

"అదేమిటే! ప్రాక్టీను లేదుగా! ప్రైవేట్ ప్రాక్టీస చెయ్య కూడదన్నావు. మళ్ళీ డిస్పెన్సరీ ఏమిటి?" ఆశ్చర్యపోతూ అడిగింది సంధ్య.

"అంటే నీ కింకా తెలియదా! మొద్దూ! ఏ యుగంలో ఉన్నావు నువ్వింకా! పేపర్లో చూడ లేదా! చాలా రోజు రోజులయింది, మళ్ళీ ప్రాక్టీస యథాప్రకారం చేసుకోవచ్చుని గవర్నమెంటు ఆర్డర్స్ జారీ చేసి! సో ఈయనగారు దానికి అంకితమై పోయేరు. ఒక అచ్చటా ముచ్చటా లేదు. పగలంతా హాస్పిటలు. సాయంత్రం నుండి రాత్రి వరకూ డిస్పెన్సరీ. కాస్తయిన తెరిపి ఉండవద్దా! ఒక రిలాక్సేషన్ అంటూ లేకుండా మరీ డబ్బే ముఖ్య మనుకుంటే ఎలా? రోజూ నాకూ, ఆయనకీ ఈ విషయంలో పోట్లాటే. అన్నీ ఉండి అనుభవించక లేకపోవడం మంటే ఇదే నేమో...."

హారిక ఇంకా ఏదో మాట్లాడ్తూనే ఉంది గానీ ... సంధ్య మెదడు అదేం రిసీవ్ చేసుకునే కండిషన్‌లో లేదు. ✱